క్లుప్తంగా

సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి

గట్టు: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వివిధ గ్రామాలకు చెందిన వీఓఏలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనం ఎదుట చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం కొనసాగింది. వీఓఏలకు బీమా సౌకర్యం, గ్రేడింగ్ విధానం రద్దు, వేతనాలను నేరుగా ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

దర్గాకు డోలు వితరణ



అయిజ: పట్టణంలోని కోట్ల వీధిలో నిర్వహిస్తున్న మహబూబ్ సుభానీ ఉర్సు సందర్భంగా రామాపురం గ్రామానికి చెందిన అబ్దుల్ రజాక్, రసూల్‌బీ దంపతులు డోలు వితరణ చేశారు. ఆదివారం వారు నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో దర్గా పెద్దలు ఆఫీసాబ్ చాంద్ బాషా, అబుబాకర్, ఖాజామొద్దీన్, మైబు, లతీఫ్, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి ఆరాధనోత్సవాలు

మల్దకల్: మండల కేంద్రంలో ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు శేషదాసుల 138 ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వంశీయులు ధీరేంద్రదాసు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రోడ్లకు మరమ్మతు చేపట్టాలి

రాజోళి: మండలంలోని ఆయా గ్రామాల్లో గుంతలమయంగా ఉన్న రహదారులకు మరమ్మతు చేయాలని కేవీపీఎస్ నాయకులు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రం నుంచి శాంతినగర్‌కు వెళ్లే రహదారి పనులు అసంపూర్తిగా వదిలేయడంతో అధ్వానంగా తయారైందని ఆరోపించారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు.

పట్టణ ఎస్ఐగా రామస్వామి



గద్వాల క్రైం: పట్టణ ఎస్ఐగా రామస్వామి ఆదివారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో వనపర్తి జిల్లా స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలో భాగంగా పట్టణానికి బదిలీపై వచ్చారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతానన్నారు. ఫ్రెండ్లీ పోలీసు విధానంతో ప్రజలకు మరింత చేరువ అవుతామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు రాజ్యాధికార యాత్ర

అయిజ: బహుజన రాజ్యాధికార యాత్ర సోమవారం నుంచి ప్రారంభమవుతుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురం, కిష్టాపురం, పర్దిపురం, ఉప్పల, ఉప్పల క్యాంపులో నిర్వహించనున్న రాజ్యాధికార యాత్రలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



అలంపూర్ రూరల్: ఆధ్యాత్మికతతో ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ అన్నారు. ఆదివారం ఆమె పెళ్లిరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని ఖిల్లా మైసమ్మ అమ్మవారిని కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. పట్టణ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని 3వ వార్డు మోమిన్ వీధిలో రూ.6కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. త్వరలో అన్ని వార్డులలో అంతర్గత రోడ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు.

పల్లెల్లో స్వచ్ఛత కరువు

ఇంకా ఆరుబయటకే...
మరుగుదొడ్లు వినియోగించని ప్రజలు
పట్టించుకోని అధికారులు



మానవపాడులో ఉన్న నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి



చెన్నిపాడులో సామూహిక మరుగుదొడ్డి కూల్చిన స్థలంలో చెత్తా చెదారం

మానవపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రత్యేక చర్యలు చేపట్టాయి. గ్రామీణులు ఆరుబయట మల, మూత్ర విసర్జనకు వెళ్లకుండా మరుగుదొడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టాయి. వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్మాణాలు ఏర్పాటు చేసుకునే విధంగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి చైతన్యం చేశారు. ఇదిలా ఉండగా నిర్మించిన మరుగుదొడ్లను వినియోగించడం లేదు. ప్రభుత్వ నిధులు ఎన్ని వెచ్చించినా ఫలితం ఉండటం దక్కడం లేదు. మరుగుదొడ్లలో వివిధ సామగ్రిని ఉంచుతూ నిరుపయోగంగా మార్చారు. చాలా చోట్ల చెత్త చెదారంతో దర్శనమిచ్చాయి.

మండలం వ్యాప్తంగా..

మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు 3005 మరుగుదొడ్ల నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు వేశారు. ఇందులో భాగంగా మొత్తం 3003 మరుగుదొడ్లను ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్మించారు.

గ్రామాల వారీగా..

అమరవాయి 226, బోరవెల్లి 278, చంద్రశేఖర్‌నగర్ 103, చండూరు 116, చెన్నిపాడు 316, గోకులపాడు 94, జల్లాపురం 431, కలుకుంట్ల 54, కొర్విపాడు 262, మద్దూరు 274, మానవపాడు 455, నారాయణపురం 104, పల్లెపాడు 170, పెద్దఆముదాలపాడు 120, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాల్లో వీఎస్‌టీ పొగాకు కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించారు.

మరుగుదొడ్లను వినియోగించని ప్రజలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో గ్రామాల్లో మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. కాని మరుగుదొడ్లు వినియోగించుకుండా బహిరంగ ప్రదేశాలకు మల, మూత్ర విసర్జనలకు వెళ్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారుల విఫలం అయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి.కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో ఆరుబయటకు వెళ్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వీడాలి



ప్రతి గ్రామంలో మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. ప్రజలు వినియోగించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించలేదు. ఇప్పటికీ బహిరంగా మల, మూత్ర విసర్జనకు వెళ్తున్నారు. వినియోగించని వారికి పింఛన్, కరెంట్, ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పథకాలను నిలిపివేయాలి. అధికారులు నిర్లక్ష్యం వీడాలి.

– ఆనంద్‌రెడ్డి, పల్లెపాడు,

అవగాహన కల్పిస్తాం



ప్రతి కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణాల కోసం అవగాహన కల్పించాం. వీటిని వినియోగించుకునేలా ప్రజలను చైతన్యం చేస్తాం. బహిరంగ మల, మూత్ర విసర్జన వెళ్లే కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తాం. ప్రజలు ఆరుబయటకు వెళ్లకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– రమణరావు ఎంపీడీఓ మానవపాడు

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో ఎస్పీ కె. సృజన ఆదేశాల మేరకు షీ టీం, పోలీస్ కళాజాతా బృందం ఆధ్వర్యంలో సైబర్‌నేరాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటస్వామి మాట్లాడారు. వాహనదారులు హెల్మెంట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గుట్కాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తునట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే పోలీస్ షీ టీం నంబర్‌కు 8712670312 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో షిటీమ్, కళాబృందం సభ్యులు రాధమ్మ, రాంరెడ్డి, శేషన్న, కృష్ణ, రామాంజనేయులు, దివ్యవాణి సభ్యులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సువార్త మహాసభలు ప్రారంభం



మహాసభలను ప్రారంభిస్తున్న ఇమ్మానుయేలు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో ఎంబీబీ బేతేలు చర్చి మూడో వార్షికోత్సవం సందర్భంగా సందర్భంగా ఆదివారం సువార్త మహాసభలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రెవ.పి.ఇమ్మానుయేలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తోటి వారితో సోదరభావంతో మెలగాలన్నారు. ప్రతి ఒక్కరిపై ప్రేమ, కరుణ చూపాలని సూచించారు. యేసుప్రభువు బోధనలు ఆచరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠం భూమిని కాపాడాలని నిరసన



పెబ్బేరు: మండలంలోని గుమ్మడంలో ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో గ్రామ కంఠం భూమిని కాపాడాలని ఆదివారం గ్రామస్తులు అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో 1.11 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధరణి మాయాజలంతో రిజిస్ట్రేషన్ చేసిన వాటిని రద్దు చేయాలన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని భూమి పంచాయతీకే చెందేలా చూడాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎల్లస్వామి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఆదివారం 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహితులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి రూ.రూ 22 వేల ఆర్థికసాయం చేశారు.

బసవేశ్వర ఆశయాలు కొనసాగిద్దాం



జిల్లా కేంద్రంలో బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేస్తున్న పోలీసులు



అయిజలో..



మానవపాడులో..



కేటీదొడ్డిలో ..



రాజోళిలో ..



వడ్డేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో..

గద్వాల క్రైం: బసవేశ్వర ఆశయాలు కొనసాగిద్దామని సీఐ శివకుమార్ అన్నారు. ఆదివారం బసవేశ్వర 890 జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కులరహిత సమాజం కోసం బసవేశ్వరుడు ఎంతో పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటయ్య, బాలచందర్ తదితరులు ఉన్నారు.

శాంతినగర్: బసవేశ్వర జయంతి వేడుకలను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వడ్డేపల్లి ఆర్ఐ అంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించారు. సమసమాజ స్థాపనలో ఆయన సేవలు మరిచిపోలేమన్నారు. అదేవిధంగా తనగలలో వీరశైవ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వీరశైవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో తెలుగు తల్లి విగ్రహంవద్ద మహనీయుడు బసవేశ్వర జయంతి సందర్భంగా మండల ప్రజలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గట్టు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణ, రాజప్ప, శివప్ప, నాగప్ప, నాగయ్య, బస్సప్ప, బస్వరాజు, చంద్రప్ప, ప్రాణేష్, సుధీర్, గ్రామస్తులు వీరారెడ్డి, పెద్దరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని డి. బుడిదపాడు శివారు, తహసీల్దార్ కార్యాలయంలో బసవేశ్వర జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు సౌకర్యార్థం వీరశైవ లింగాయత్ సంఘం సభ్యులు శర్నయ్య, రామయ్య, సురేష్ రూ.50 వేల ఆర్థిక సహకారంతో బస్‌షెల్టర్‌ను నిర్మించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సంఘం జిల్లా అధ్యక్షుడు నీలప్ప, నియోజక వర్గ అధ్యక్షుడు నాగమల్లయ్య, ఎంపీటీసి రాజశేఖర్, లోకారెడ్డి, చంద్రారెడ్డి, కృష్ణ, కృష్ణ గౌడ్, మహేశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బసవేశ్వర చిత్రపటానికి ఆర్ఐ రజానీకాంత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సమాజంలో కుల వ్యవస్థను, వర్ణభేదాలను లింగ వివక్షతను వ్యతిరేకించిన మహనీయుడు బసవేశ్వరుడు అని కొనియాడారు. దామోదర్‌రెడ్డి, సీతారామిరెడ్డి, హన్మంత్‌రెడ్డి, రాజారెడ్డి, రూక్మాందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బసవేశ్వర చిత్రపటానికి ఆర్ఐ ఉదయ్‌కిరణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుమార్, వెంకటేష్‌నాయుడు, వీరారెడ్డి, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో బసవేశ్వర జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ గంగి రెడ్డి, మాజీ ఎంపీటీసీ తుకారాం, ఈశ్వరయ్య, ఆడివిస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం



అయిజలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



గట్టులో విద్యార్థులకు నీరు అందిస్తున్న ఎస్ఐ

గట్టు: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలతో పాటు కస్తూర్బాగాంధీ, మానవపాడు పాఠశాల పరీక్ష కేందాలలో గురుకులాలో 5 వ తరగతి ప్రవేశ పరీక్షా ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రాల దగ్గర పోలీస్ బందోబస్తును నిర్వహించారు. రైజింగ్ స్టార్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు రామతులసి, సుబ్బన్నలు గురుకుల పాఠశాల ఎదుట నీటి వసతి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ పవన్‌కుమార్ విద్యార్థులకు నీరు అందించారు. అనంతరం నిర్వాహకులను అభినందించారు.

అయిజ: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. మొత్తం 300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావల్సి ఉండగా 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కేజీబీవీ ఎస్ఓ, ఎగ్జాం చీఫ్ సూపరింటెండెంట్ చెన్నబసమ్మ తెలిపారు.

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 5 వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 350 మంది విద్యార్థులకు 320 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ ధర్మారెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయండి





అయిజ, అలంపూర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి, రాజగోపాల్

అయిజ: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25న నిరుద్యోగ మార్చ్‌ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్వాల జిల్లాలోని నిరుద్యోగులు పార్టీలకు అతీతంగా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో శేఖర్, లక్ష్మణ్‌గౌడ్, భగత్ రెడ్డి, వెంకటేష్, శివన్న, కృష్ణ, రాజశేఖర్, చిరంజీవి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌లో నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ కోరారు. ఆదివారం పట్టణంలోని తెలంగాణ అతిథి గృహంలో పట్టణ అధ్యక్షుడు నాగ మద్దిలేటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న మధ్యాహ్నం 3:00 గంటలకు నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌కు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. నాగ మద్దిలేటి, శరత్‌బాబు, నర్సిములు, మద్దిలేటి, సూరిబాబు, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

శాంతినగర్: మహబూబ్‌నగర్‌లో మంగళవారం నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌కు వడ్డేపల్లి మండల నుంచి నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని బీజేపీ మండల అధ్యక్షుడు నరసింహ అన్నారు. ఆదివారం వడ్డేపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఓబీసీ మోర్చా సభ్యుడు జగదీష్‌గౌడ్, అలంపూర్ మండల అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, మానవపాడు ప్రధాన కార్యదర్శి అశోక్‌లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

ఉండవెల్లి: అలంపూర్ నియోజకవర్గంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల వద్ద ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఏడీ మగ్బూల్ ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఈనెల 25 వ తేదీ నుంచి సబ్‌స్టేషన్ ఆపరేటర్లు పనిచేస్తున్న హెచ్–82 ఆర్టిజన్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మెకు వెళ్తున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని వారి స్థానంలో స్పెషల్ డిపార్ట్‌మెంట్ వారిని నియమించినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఎస్మా చట్టం అమల్లోకి వస్తుందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ఎమ్మెల్యే ఈటెల దిష్టిబొమ్మ దహనం



పాన్‌గల్‌లో ఈటెల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించే నైతిక హక్కు ఈటలకు లేదన్నారు. రేవంత్‌రెడ్డిపై చేసిన అసత్య ఆరోపణలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే కార్యకర్తల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో వహీద్, రవి, గోపి, రవినాయక్, రాజ్‌కుమార్‌యాదవ్, సుధాకర్‌యాదవ్, గంగాధర్‌నాయుడు, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఘనంగా పుస్తక దినోత్సవం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజేష్, రమేష్, అంజి, రాము, వంశీ, నాగేశ్వర్‌రావు, రాము, బుచ్చయ్య, భరత్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com